ఇంటింటా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కొయ్యూరు, చింతూరులలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



కుమ్మూరులో గ్రామస్తులతో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కొయ్యూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సుపరిపాలన, సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలోని కినపర్తి పంచాయతీలో ములగలమెట్ట, రిట్టమానిపాలెం, వలసంపేట, భీమవరం, కొండగోకిరి పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 481 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించి, కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేదల జీవితాలను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని సుపరిపాలన, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. పర్యటనలో భాగంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై ఆమె స్పందించి, త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, వైస్ ఎంపీపీలు ఎ.వెంకటరమణ, ఎ.నూకాలు, ఎంపీడీవో మేరీ రోజ్, ఎంఈవో బోడంనాయుడు, జేఈ విశ్వతేజ్, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, సర్పంచ్‌లు జె.రాజ కుమారి, పి.శ్రీను, ఆర్.వెంకటలక్ష్మి, ఆర్.శ్రీను, ఎస్.చంద్రరావు, నాయకులు సత్యనారాయణ, సావిత్రి, సుధాకర్, బాబ్జి, అచ్చిరాజు, రవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతూరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని కుమ్మూరు, మామిళ్ల గూడెంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 500 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించి, సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. వరదలకు ఇళ్లు కోల్పోయిన బాధితులు గృహ పునర్నిర్మాణాలకు అవసరమైన కలప సేకరించుకునేలా అటవీ అధికారులతో మాట్లాడతానని ఆమె హామీ ఇచ్చారు. వరదలకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, ఎంపీడీవో రవిబాబు, సర్పంచ్ ముచ్చిక నాగార్జున, మండల పార్టీ కన్వీనర్ వై.రామలింగారెడ్డి, నాయకులు కృష్ణ , కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, జయరాజ్, అక్బర్‌అలీ, సాయిబాబు, జిక్రియా, మురళి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సను కలిసిన ఎమ్మెల్యే పాల్గుణ



మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయరూరల్: విజయవాడ అమరావతిలోని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోందని మంత్రికి ఎమ్మెల్యే పాల్గుణ వివరించారు.

గడప గడప నిధులతో గ్రామాల్లో ప్రధానమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పాల్గుణకు మంత్రి బొత్స సూచించారు.

క్లుప్తంగా

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



చిలకలపాలెంలో రీసర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమంతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారమవుతాయని పెదలువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీ చిలకలపాలెం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సిబ్బంది గ్రామస్తుల సమక్షంలో భూసర్వే కార్యక్రమం నిర్వహించారు. వీఆర్వో లకే రామకృష్ణ, సచివాలయం సర్వేయర్ మత్స్యరాస జయసింహరాజు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం

దుంబ్రిగుడ: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మరో పదేళ్ల పొడిగింపుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి చెప్పారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుతో గిరిజన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అడ్డతీగల: వై.రామవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతులతో పాటు వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిర్వహిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ డీఈ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వై.రామవరం మండలంలోని గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

గ్రామాల్లో నేడు 'గడప గడపకు'

చింతపల్లిరూరల్: మండలంలోని తాజంగి పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. సచివాలయం-1 పరిధిలోని 8 గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. అన్ని శాఖల అధికారులు వివరాలతో హాజరు కావాలని సూచించారు.

చింతపల్లిరేవులో...

వీఆర్‌పురం: మండలంలోని చింతరేవుపల్లిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాడియం గోపాల్, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని, ఉదయం 11 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరి విద్యార్థినికి ఏయూ డాక్టరేట్



ఏయూ వీసీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ పత్రం అందుకుంటున్న దివ్యజ్యోతి

అరకులోయ రూరల్: మండల కేంద్రానికి చెందిన గిరిజన విద్యార్థిని లబుడుబారికి దివ్యజ్యోతి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పూర్తి చేశారు. ఏయూలో ఎంఎస్సీ(బాటనీ) అభ్యసించి, వృక్షశాస్త్ర విభాగంలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి నుంచి దివ్యజ్యోతి మంగళవారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ వృక్షశాస్త్రంలో డాక్టరేట్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆమెకు కుటుంబసభ్యులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

గృహ సారథుల ఎంపిక వేగవంతం



వివరాలు నమోదు చేస్తున్న మండల పార్టీ కన్వీనర్ సంపత్‌కుమార్

అరకులోయ రూరల్: మండలంలోని మాదల, సుంకరమెట్ట పంచాయతీల్లోని బట్టివలస, నందివలస, దుమగుడ్రి, గెట్టువలస, బెడ్డగూడ, పెద్దగంగుడి గ్రామాల్లో మండల పార్టీ కన్వీనర్ పట్టాసి సంపత్ కుమార్ మంగళవారం పర్యటించి గృహ సారథుల ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గృహ సారథుల ఎంపిక ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఈ ఎంపిక ప్రక్రియను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించి పూర్తి చేయాలన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గాసి, నాయకులు రఘునాథ్, పంచాయతీ కన్వీనర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ సంతవీధి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.10లక్షలతో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులకు మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి తదితరులు భూమి పూజ చేశారు. మల్లికార్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గిరిజన గ్రామాల్లో జలధారలు కలుగుతున్నాయన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని, ఎన్నడూ జరగని సంక్షేమం జగనన్న పాలనలో జరుగుతుందన్నారు. గిరిజనులంతా వైఎస్సార్‌సీపీ పక్షాన ఉండి అభివృద్ధి పథంలో నడవాలని ఆయన కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు మూర్తి, పద్మారావు, రాంప్రసాద్, పులిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని డోలీలో తరలింపు

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ కరకవలస గ్రామానికి చెందిన కోటపర్తి తమ్మయ్య(14) అనే బాలుడు గత పది రోజులుగా కాలు, చేతులు వాపులతో బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం గ్రామం నుంచి డోలీమోతలో కిలోమీటరు వరకు మోసుకుంటూ రొంపల్లి రహదారి వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి వైద్యసేవలు నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. వైద్యసేవలు అందించి, మెరుగైన వైద్యసేవలు నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు బాలుడిని తరలించారు. గతంలోని కరకవలస గ్రామంలోని కాలు చేతుల వాపుతో పలువురు గిరిజనులు మృత్యువాతపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించి గ్రామంలోని వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన యువత క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ కిట్లను అందజేస్తున్న శివప్రసాద్, సీఐ స్వామినాయుడు

కొయ్యూరు: యువకులు క్రీడల్లో రాణించి సొంత గ్రామానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలని నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్, కొయ్యూరు సీఐ స్వామినాయుడు కోరారు. వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీరధారుఢ్యం పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మండలంలోని బి.కొత్తూరు, లుభర్తి, గింజర్తి, చింతలపూడి గ్రామాల్లో వారు మంగళవారం పర్యటించారు. స్థానిక యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ మాట్లాడుతూ గిరిజన యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎంపీ గొడ్డేటి మాధవి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో వాలీబాల్, షటిల్, క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించామన్నారు. ఎంపీ మాధవి ప్రోత్సాహంతో క్రీడాకారులకు ఆట సామగ్రి అందజేస్తున్నట్టు చెప్పారు. వాలీబాల్ కిట్లు అవసరమైన వారు తమను సంప్రదిస్తే వారికి అందజేస్తామని చెప్పారు. ట్రైనీ ఎస్‌ఐ చాణిక్య, నేను సైతం చారిటబుల్ సంస్థ డైరెక్టర్లు కొర్రుపోలు పృథ్వీరాజు, పంచాడ శ్రీరామ్, మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉల్లి సూరిబాబు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ప్రాంతీయ వ్యాయామ విద్య పర్యవేక్షణాధికారి మనోహర్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అరకులోయ, డుంబ్రిగూడ, అనంతగిరి మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతీయ వ్యాయమ విద్య పర్యవేక్షణ అధికారి మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల వారీగా ఈనెల 25లోగా విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సూరిబాబు, మత్స్యరాజు, భూపతిరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

దుంబ్రిగుడ: మండలంలోని సాగర , దేముడువలస, గసభ గ్రామ సచివాలయాలను ఎంపీడీవో నగేష్ మంగళవారం సందర్శించారు. సిబ్బంది అ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఆయన వెంట ఈవో పీఆర్డీ వల్లిబాయ్, పంచాయతీ కార్యదర్శి సద్దు, సిబ్బంది నంద తదితరులున్నారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



గాయపడ్డ నాగేశ్వరరావు

చింతపల్లి: అన్నవరం సమీపంలో మంగళవారం ఆటో నుంచి జారిపడి గిరిజనుడుకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తరలించారు. కోరుకొండ నుంచి అన్నవరం వస్తున్న ఆటో నుంచి తడకపల్లికి చెందిన కిల్లో నాగేశ్వరరావు అన్నవరం సమీపంలో జారి పడడంతో కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు కాలు విరిగినట్టుగా గుర్తించి ప్రాథమిక చికిత్సల అనంతరం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

పాలించే స్థాయికి ఎదగాలి

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆకాంక్ష

జి.మాడుగుల: దేశానికి మార్గదర్శకులు దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ములను బాలికలు ఆదర్శంగా తీసుకుని పాలించే స్థాయికి ఎదగాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరం బాలికలు అన్ని విషయాల్లో ముందంజలో ఉండాలని ఆయన సూచించారు. సమాజంలో స్త్రీ అంటే చిన్న చూపు చేసే స్థానం నుంచి ఈ నాడు దేశాన్ని పరిపాలించే స్థాయికి ఎదిగారని ఆయన అన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యానేరమన్నారు. ఉల్లంఘిస్తే బాల్య వివాహ నిషేధ చట్టం- 2006 ప్రకారం రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా, బాలికలను లైంగిక వేధింపులకు గురిచేస్తే 2012 పోక్సో చట్టం కింద శిక్షార్హులని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహాలను తల్లిదండ్రులు, బంధువులు ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని ఆమె వివరించారు. కౌమార బాలికల్లో రక్తహీనత అధికంగా ఉందని, ప్రతీ బాలికకు 12-15గ్రాములు హిమోగ్లోబిన్ స్థాయి ఉండాలని ఆమె సూచించారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ బాలికలకు విశ్వాసం, నమ్మకం, పట్టుదల ఉంటే దేనినైనా సాధించగలరని ఆయన అన్నారు. దిశా, పోక్సో, నిర్భయ చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, సీడీపీవో సువర్ణమ్మ, ఎస్‌ఐ శ్రీనివాస్, వైద్యాధికారులు రవి చంద్రశేఖర్, శశికాంత్, ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్, హెచ్‌ఎం పార్వతి పాల్గొన్నారు.

గ్రామాలకు రోడ్డు సదుపాయం



పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సురేష్‌కుమార్

పెదబయలు: పంచాయతీల్లోని అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్ అన్నారు. కొత్తరూడకోట సంతబయలు నుంచి పాత రూడకోట గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో కల్వర్టుకు నిధులు మంజూరైనట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలకు చర్యలు తీసుకున్నారన్నారు. దీనికి తోడుగా అరకు ఎమ్మెల్యే గిరిజన గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించారని చెప్పారు. ఆయన చొరవతో మండలంలోని జామిగుడ, గిన్నెలకోట, ఇంజరి, కుంతుర్ల పంచాయతీలకు రోడ్డు సదుపాయం కలిగిందన్నారు. రూడకోట నుంచి జామిగుడ వరకు, జామిగుడ నుంచి ఒడిశా సరిహద్దు వరకు రోడ్డు పనులు ప్రారంభమైనట్టు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని గమనించాలని కోరారు. వార్డు సభ్యులు కిశోర్, రామారావు, గణేష్, గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న అనంతగిరి ఎస్‌ఐ కరక రాము

అనంతగిరి: ఉపాధి అవకాశాలపై గ్రామాల్లో యువతీ, యువకులకు అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు అనంతగిరి ఎస్‌ఐ కరక రాము సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నంలోని డీడీయూజీకేవై సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీయూజీకేవై సెంటర్ నిర్వాహకులు చలపతి, ప్రకాష్‌తో కలిసి ఎస్‌ఐ కరక రాము సచివాలయం మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాము మాట్లాడుతూ గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు గ్రామాల్లో గిరిజన యువతకు డీడీయూజీకేవై అందిస్తున్న వివిధ కోర్సుల్లో స్కిల్ ట్రైనింగ్, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలిక దినోత్సవం



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య



బొడ్డగొందిలో చిన్నారులకు పుస్తకాలు అందిస్తున్న సర్పంచ్ భాగ్యవతి, నేతలు



అనంతగిరిలో మాట్లాడుతున్న లవకుశ

అనంతగిరి: జిల్లాలో జాతీయ బాలిక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చట్టాలు అమలుచేస్తోందన్నారు. బాలిక విద్య, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు ఉన్నత విద్య చదివించాలన్నారు. ఆటలు, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వాడవాడలా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతగిరి మండలం కొత్తూరు కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ నరసింహమూర్తి, సీఆర్పీ జిల్లా కన్వీనర్ లవకుశ, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: జర్రెల పంచాయతీ మండిభ, బొడ్డగొంది, సెల్లుం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నాయకం భాగ్యవతి, నాయకులు సురేష్, ,రాజారావు, సిద్ధేశ్వరావు, వార్డు సభ్యులు, స్కూల్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, ఐసీడీఎస్ సీడీపీవో రమ్య, హెచ్‌ఎం కొండలరావు, వార్డెన్ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: పాలమామిడి పంచాయతీ కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం: రేఖపల్లి కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో విమల, ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ పూనెం సరోజని తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండల కేంద్రంలోని సచివాలయ మహిళా పోలీసు పి.దీప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంటు డాక్టర్ ఎమ్.గౌతమి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరకృప, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. తోటకూరపాలెంలోని కేజీబీవీలో ప్రిన్సిపాల్ ఎస్.జ్యోత్స్నదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రామలక్ష్మి, బుల్లమ్మ, రాజులమ్మ, అలియా రాణి, సరస్వతి, మహిళా పోలీసు శారద తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో మణమ్మ, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాలమామిడిలో సంప్రదాయ వేషధారణలో గిరి విద్యార్థులు



రేఖపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు



తోటకూరపాలెం కేజీబీవీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోత్స్నదేవి



రాజవొమ్మంగిలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మణమ్మ

రెండు వేల లీటర్ల పులుపు ధ్వంసం



పులుపును ధ్వంసం చేసిన గ్రామస్తులతో ఎస్‌ఈబీ ఎస్‌ఐ దాసు

అనంతగిరి: గుమ్మకోట పంచాయతీ భీమవరంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ దాసు మంగళవారం పర్యటించారు. గ్రామంలో సారా తయారీకి ఉపయోగిస్తున్న 2వేల లీటర్ల పులుపు ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గ్రామస్తులతో కలిసి దాడులు చేసి పులుపు ఇతర సామగ్రి ధ్వంసం చేసినట్టు చెప్పారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించిన, భీమవరం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. సారా నిర్మూలనకు గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ, ఎస్‌ఈబీ సిబ్బంది సత్యం, తిరుపతిరావు తదితరులున్నారు.